# సీఐగా బాధ్యతలు స్వీకరించిన కటకం సత్యనారాయణ



**ఖానాపూర్, జూన్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్గా కటకం సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సీఐ అజయ్ కుమార్ హైదరాబాదుకు బదిలీ కాగా, ఆయన స్థానంలో సత్యనారాయణ నియమితులయ్యారు. గతంలో ఆసిఫాబాద్ డీసీఆర్‌బీలో సీఐగా విధులు నిర్వహించిన సత్యనారాయణను ఖానాపూర్ పోలీస్ సిబ్బంది ఘనంగా స్వాగతించారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తానని ఆయన తెలిపారు. సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించడంతో ఖానాపూర్ పోలీస్ సర్కిల్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# పీఎంజే జువెలరీ దోపిడీ కేసులో కీలక పురోగతి




**కరీంనగర్, జూన్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పీఎంజే జువెలరీ షాప్ దోపిడీ కేసులో ముగ్గురు ప్రధాన నిందితుల పోలీస్ కస్టడీ ముగిసింది. జూన్ 3 ఉదయం నుంచి జూన్ 7 ఉదయం వరకు నిందితులను విచారించిన పోలీసులు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు రఘునాథ్ కర్మాకర్, రవీష్ కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు వెలిచాల బైపాస్ వద్ద చెట్ల పొదలలో దాచిన రెండు పిస్టల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మద్దునూరు గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో నేరానికి సంబంధించిన ఒక మొబైల్ ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అయితే దొంగిలించిన బంగారు, వజ్రాభరణాల దాచివేత, విక్రయాలపై నిందితులు తప్పుదారి పట్టించే వాంగ్మూలాలు ఇస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో మరికొన్ని రోజులు కస్టడీకి ఇవ్వాలని న్యాయస్థానంలో రిక్విజిషన్ దాఖలు చేయనున్నారు. ఇక పరారీలో ఉన్న మరో కీలక నిందితుడు అమర్ సింగ్ అలియాస్ పహిల్వాన్‌ను జూన్ 4న బీహార్ రాష్ట్రం పాట్నా జిల్లాలో పోలీసులు అరెస్ట్ చేశారు. ట్రాన్సిట్ వారెంట్ పొందిన అనంతరం కరీంనగర్‌కు తీసుకువస్తున్నట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వెల్లడించారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

# ముస్సోరీలో ప్రతిష్ఠాత్మక శిక్షణకు ఎంపికైన మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్, జూన్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరీలో లాల్ బహదూర్ జాతీయ పరిపాలన అకాడమీలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక శిక్షణా కార్యక్రమానికి కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఎంపికయ్యారు. జూన్ 8 నుంచి 13 వరకు వారం రోజులపాటు జరిగే గుడ్ గవర్నెన్స్ ఫర్ ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్ శిక్షణలో ఆయన పాల్గొననున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ శిక్షణకు ఎంపిక కావడం కరీంనగర్ నగరపాలక సంస్థకు గౌరవంగా భావిస్తున్నారు. ప్రఫుల్ దేశాయ్ ఎంపికతో కరీంనగర్ మున్సిపల్ పరిపాలనకు విశిష్ట గుర్తింపు లభించింది.

# స్వదేశీ వస్తువుల వినియోగంపై అవగాహన సదస్సు



**కరీంనగర్, జూన్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో వాణి నికేతన్ కిడ్స్ కేర్‌లో స్వదేశీ వస్తువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వదేశీ వస్తువుల ఉపయోగాలు, వాటి ప్రాముఖ్యతపై సదస్సు జరిగింది. కార్యక్రమంలో మనోహర్ అగర్వాల్, డాక్టర్ సతులింగమూర్తి, సాయిప్రసాద్, హరీష్ బాబు, డాక్టర్ కటకం అమర్నాథ్, నాగమల్ల వేణుమాధవ్, మాధవరావు, దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కరీంనగర్ పట్టణ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగర విభాగ కన్వీనర్గా పసుల మైపాల్, కో--కన్వీనర్గా దీకొండ తిరుపతి, ట్రెజరర్గా పసుల తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. స్వదేశీ వస్తువుల వినియోగం దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# మృగశిర కార్తి రైతు ఆశల కాలం



సూర్యుడు రోహిణి నుంచి మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించడంతో మృగశిర కార్తి ప్రారంభమైంది. ఇది వానాకాలం పంటలకు అసలైన ముహూర్తం. నైరుతి రుతుపవనాలు బలపడే సూచనలు కనిపిస్తున్నాయి. పొలాల్లో తేమ పెరగడంతో దున్నకానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. వరి నారుమడి, పత్తి, మొక్కజొన్న, సోయా, పెసర విత్తనాలు నాటడానికి ఇది సరైన సమయం. రైతు చేతినిండా పనులు పెట్టుకున్నాడు. ఎరువులు తెచ్చుకోవడం, నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవడం, పొలం కాలువలు బాగు చేయడం, నీటి ఎద్దడి సమస్యలు పరిష్కరించుకోవడం, బోర్‌మోటార్లు రిపేర్ చేయించుకోవడం ఇలా అన్ని పనులు ఒకేసారి సాగుతున్నాయి. విత్తనాలు కొనుగోలు చేసే ముందు నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించాలి. నాసిరకం విత్తనం రైతు కష్టాన్ని వృథా చేస్తుంది. నేడు హైబ్రిడ్ విత్తనాల్లో రోగనిరోధక శక్తి కూడా అందుబాటులో ఉంది. మంచి విత్తనం ఎంపిక చేస్తే అధిక దిగుబడి వస్తుంది. మృగశిర కార్తి రైతుకు ఆశను ఇస్తుంది. కానీ ఆశతో పాటు అప్రమత్తత కూడా అవసరం. వాతావరణ శాఖ సూచనలు పాటిస్తూ, వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుంటూ ముందుకు వెళ్తే మంచి పంట చేతికొస్తుంది. రైతు సంతోషంగా ఉంటేనే దేశం బాగుపడుతుంది. రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థలో రైతు పాత్ర కీలకం. అన్నదాత సుఖీభవ -- రైతే రాజ్యానికి వెన్నుముక.

**వ్యాసకర్త**
**ఏలూరి రఘుమారెడ్డి, బి.ఎ**

# చెరువు మరమ్మతులపై వైసీపీ ఆగ్రహం



**నందికొట్కూరు, జూన్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మిడుతూరు మండలంలోని మదిగుండం చెరువు గండి మరమ్మత్తులు నాసిరకంగా జరుగుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ దారా సుధీర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పనులను పరిశీలించారు. చెరువు 283 ఎకరాల విస్తీర్ణంలో ఉండి, దాని నీటితో 2800 ఎకరాలకు సాగు జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం గండి పడిన తర్వాత ప్రభుత్వం 36 లక్షలు మంజూరు చేసినా, కేవలం 10 లక్షలతో పనులు పూర్తి చేసి మిగతా సొమ్ము టిడిపి నాయకుల జేబుల్లోకి వెళ్లిపోయిందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మిడుతూరు మండల వైసీపీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చెరువు మరమ్మత్తుల్లో నాణ్యత లేకపోవడంపై వైసీపీ తీవ్రంగా స్పందించింది.

# యోగాంధ్ర--2026 ప్రారంభం




**నంద్యాల, జూన్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర--2026 కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి లాంఛనంగా ప్రారంభించారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తమైందని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని ఆమె సూచించారు. యోగా శిక్షకుల ఆధ్వర్యంలో వివిధ ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యాన ప్రక్రియలను అధికారులు, పాల్గొన్నవారు ప్రదర్శించారు. అనంతరం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సైకిల్ ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ఫిట్‌నెస్ మరియు ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. యోగాంధ్ర--2026లో యోగా, సైకిల్ ర్యాలీతో ఆరోగ్యంపై అవగాహన పెంచారు.లి

# 11వ వార్డులో సమస్యల పరిష్కారానికై ప్రజల వినతి



**ఖానాపూర్, జూన్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మున్సిపాలిటీలో గ్రామసభలు జరుగుతున్నాయి. ప్రతి రోజు ఒక వార్డులో అధికారులు, స్థానిక నాయకులు పాల్గొంటున్నారు. ఈ క్రమంలో 11వ వార్డులో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. శివారు ప్రాంతంగా ఉండటంతో విద్యుత్, నీటి సరఫరా, అపరిశుభ్రత, ధ్వంసమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని నివాసులు తెలిపారు. ఖాళీ ప్రదేశాల్లో చెట్లు, పుట్టలు పెరిగి విషజంతువులు ఆవాసాలుగా మారాయని, ఇటీవల ఒక వ్యక్తి పాముకాటుతో మృతి చెందిన ఘటనను గుర్తుచేశారు. వర్షాకాలం ముందు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి రవాణాకు ఇబ్బందులు లేకుండా చూడాలని, సీసీ రోడ్లను మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు. శివారు వాడులను పట్టించుకోవడంలేదనే అపవాదు ఉన్నప్పటికీ, నూతన మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక, మాజీ చైర్మన్ రాజురా, చిన్నం సత్యనారాయణ వార్డు అభివృద్ధికి కృషి చేసి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. 11వ వార్డు ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు కోరుతున్నారు.

# బీరవెల్లిలో చేపమందు పంపిణీ



**ఖానాపూర్, జూన్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ జిల్లా బీరవెల్లి గ్రామంలో సోమవారం రాత్రి చేపమందు పంపిణీ జరగనుంది. రాత్రి 8 గంటల నుండి ఉదయం వరకు సగం వంశీయులు చేపమందు వేస్తారని నిర్వాహకులు తెలిపారు. గత 65 సంవత్సరాలుగా చేపమందు సంప్రదాయం కొనసాగుతోందని, ఉబ్బసం, ఆస్తమా, దగ్గు వంటి వ్యాధులతో బాధపడేవారికి ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మృగశిర కార్తి ప్రారంభం రోజునే చేపమందు వేస్తారని తెలిపారు. మహారాష్ట్ర, నిర్మల్, అదిలాబాద్, మంచిర్యాల్, ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల నుండి వేల సంఖ్యలో ప్రజలు వస్తారని, సగం వంశీయులు 10--15 మంది కలిసి చేపమందు వేస్తారని చెప్పారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నీటి వసతులు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సారంగాపూర్ ఎస్సై సిబ్బంది బందోబస్తు చేపడుతున్నారు. దీర్ఘకాల సంప్రదాయంగా కొనసాగుతున్న చేపమందు పంపిణీకి ఈసారి కూడా వేలాది మంది హాజరుకానున్నారు.

# యోగాతో మానసిక ఒత్తిడి దూరం

**- ఎస్పీ సునీల్ షోరాణ్**



**నంద్యాల, జూన్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆకాంక్ష యోగా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యోగా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని, నిత్యం సాధన చేస్తే ఒత్తిడి తగ్గి కుటుంబ, సామాజిక సమస్యలు తగ్గుముఖం పడతాయని ఆయన పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే భార్యాభర్తల గొడవలు, కౌన్సిలింగ్ కేసులు కూడా యోగా అలవాటు చేసుకుంటే తగ్గుతాయని, పోలీసుల పనిభారం సగం తగ్గుతుందని ఎస్పీ అభిప్రాయపడ్డారు. గత 28 సంవత్సరాలుగా లాభాపేక్ష లేకుండా ఉచితంగా యోగా సేవలు అందిస్తున్న ఆకాంక్ష యోగా సంస్థ కృషిని ఆయన అభినందించారు. సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం. జావళి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడికి యోగా అద్భుత పరిష్కారమని, ప్రత్యేక పరికరాలు అవసరం లేకుండా అన్ని వయసుల వారు ఇంట్లోనే సాధన చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా విశిష్టతను తెలిపే నాటిక అందరినీ ఆకట్టుకున్నాయి. మహిళలు, చిన్నారులు, యోగా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మానసిక ఒత్తిడిని దూరం చేస్తూ ఆకాంక్ష యోగా సంస్థ ఉచిత సేవలు అభినందనీయం.

